

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్
మంగళవారం | నవంబర్ 21, 2023 | www.navatelangana.com

ఇందిరమ్మ రాజ్యంలో ఆకలి కేకలు



- నిర్బంధాలు, ప్రభుత్వాలు కూల్చుడు పనిగానే పాలన
- అటువంటి రాజ్యం తెస్తామంటున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి
- కరెంటు మూడు గంటలు కావాలా? 24గంటలు కావాలో ఆలోచన చేయండి
- బీఆర్ఎస్ చూపిన ప్రగతికి పట్టంకట్టండి
- హుజూరాబాద్ మాదిరిగానే మానకొండూర్‌లోనూ దళితబంధు ఇస్తాం
- బీఆర్ఎస్ మానకొండూర్ ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్
- అభివృద్ధిని వివరిస్తూ.. విపక్షాలపై విమర్శనాస్త్రాలు



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / తిమ్మాపూర్

మిగతా 7లో..

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి

కేంద్ర ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ ఎ.సతీష్ గణేష్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కేంద్ర ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ ఎ.సతీష్ గణేష్

నవతెలంగాణ - కరీంనగర్ :

డిసెంబర్ 3న ఎస్సారార్ కళాశాలలో కరీంనగర్, మానకొండూర్, హుజురాబాద్, చొప్పదండి నియోజకవర్గాల అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని కేంద్ర ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ ఎ.సతీష్ గణేష్ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాలలో డిసెంబర్ 3న నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి పోలీస్ అబ్జర్వర్ ఎ.సతీష్ గణేష్, సాధారణ పరిశీలకులు డాక్టర్ సీఆర్.ప్రసన్న పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలో కౌంటింగ్ కేంద్రం కోసం చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించిన పరిశీలకులు సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు కౌంటింగ్ కేంద్రంలోనికి ప్రవేశించడానికి ప్రతి నియోజకవర్గం వారిగా వేరువేరు ప్రవేశాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కౌంటింగ్ పూర్తి చేసుకున్న ఈవీఎంలను కళాశాలలో ఏర్పాటు చేసుకున్న స్ట్రాంగ్ రూంకు తరలించి క్రమసంఖ్య ప్రకారం నిలువ చేసేలా చూడాలని తెలిపారు. కళాశాలలో నియోజకవర్గం వారిగా చేపట్టిన ఏర్పాట్లను గురించి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పరిశీలకులకు మ్యాప్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో చొప్పదండి, కరీంనగర్ రిటర్నింగ్ అధికారులు ప్రఫుల్‌దేశాయ్, కే.మహేశ్వర్, కళాశాల ప్రిన్సిపాల్, రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అమ్ముకునే బీజేపీని ఓడించండి..

సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

నవతెలంగాణ - కరీంనగర్ :

దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అమ్ముకునే బీజేపీని ఓడించండి అని సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో గుడికందుల సత్యం అధ్యక్షతన సీపీఐ(ఎం) జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. భారతదేశ సంపదను దోచుకొని కార్పొరేట్ శక్తులకు అమ్ముకుంటున్న బీజేపీని ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన ఈ పది సంవత్సరాలలో ప్రభుత్వ రంగ సంస్థలు ఎల్ఐసీ, బీఎస్ఎన్ఎల్, రైల్వే, రక్షణ రంగం, విమానాశ్రయాలను అంబానీ, ఆదానీలకు అప్పనంగా అమ్ముకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద, సామాన్యులు, మధ్య తరగతి ప్రజలు వినియోగిస్తున్న పప్పు, పాలు, నూనె తదితర నిత్యావసర సరుకుల ధరలపై జీఎస్టీ పన్నులు వేసి ప్రజానీకాన్ని దోచుకుంటున్నారని అన్నారు. ఎన్నికల ముందు సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని యువతను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చాక పట్టించుకోకుండా.. ఇప్పటికే ఉన్న ఉద్యోగాలను ఊడగొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను రోజురోజుకు పెంచుతూ ప్రజలపై భారాలు వేస్తున్నారని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే నల్లధనాన్ని బయటకు తీసుకువచ్చి ప్రతి పేద కుటుంబంలో 15 లక్షల రూపాయలు జమ చేస్తానని ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగిలిపోయాయని ఎద్దేవా చేశారు. మణిపూర్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ తదితర బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలలో మహిళలను చిత్రహింసలకు గురిచేస్తూ నగ్నంగా ఊరేగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల నడ్డివిరిచే విధంగా నూతనంగా రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చి ఢిల్లీ కేంద్రంలో వేలాది మంది రైతుల ప్రాణాలను బలిగొన్నారని, రైతులపై అక్రమ కేసులు బనాయించి, చిత్రహింసలకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కి కార్పొరేట్ శక్తులకు అనుగుణంగా నాలుగు లేబర్ కోడ్ లు తెచ్చి కార్మికుల నడ్డి విరిచారని అన్నారు. దేశంలో అన్ని వర్గాల ప్రజలు కలిసి ఉండడం ఓర్వలేక కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, బీజేపీ అధికారంలోకి వస్తే దేశంలో మతకల్లోలాలు పెరిగి ప్రజలు భయం గుప్పెట్లో

మిగతా 4లో...

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

నవతెలంగాణ - వీర్నపల్లి :

అప్పుల బాధతాళలేక ఓ రైతు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం భూక్యతండ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. భూక్యతండాకు చెందిన భూక్య శంకర్ (48)కు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. పిల్లలిద్దరికీ పెండ్లి చేశాడు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీరి కుటుంబంలో శంకర్ కొడుకు లింగమూర్తి అనారోగ్యంపాలయ్యాడు. అతని ఆస్పత్రి ఖర్చులకు చేసిన అప్పులు వడ్డీతో కలిపి రూ.15లక్షల వరకూ అయింది. చేసిన అప్పు వ్యవసాయం మీద తీర్చలేక తీవ్ర మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నవత తెలిపారు.

దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అమ్ముకునే బీజేపీని ఓడించండి..

(మొదటిపేజీ తరువాయి)

బతకవలసిన రోజులు వస్తాయని, దేశ సంపదను కొద్ది మంది చేతుల్లోకి తీసుకెళ్తారని అలాంటి మతోన్మాద, కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక బీజేపీని ఓడించాలని అన్నారు. సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్రంలో 19 స్థానాల్లో ఒంటరిగానే పోటీ చేస్తుందని, సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించి పేదల గొంతుక అసెంబ్లీలో వినిపించాలని అన్నారు. కొత్తగూడెంలో సీపీఐకి మద్దతు ఇస్తున్నామని, మిగతా చోట్ల లౌకిక ప్రజాతంత్ర సామాజిక శక్తులకు మద్దతు ఇస్తామని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గీట్ల ముకుందరెడ్డి, వర్ణ వెంకటరెడ్డి, జి.బీమాసాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సంపత్, ఎడ్ల రమేష్, వెల్మారెడ్డి రాజిరెడ్డి, శీలం అశోక్, మక్కపల్లి పూజ, జి.రాజేశం, నరేష్ పటేల్, కోనేటి నాగమణి, వడ్ల రాజు, రాయికంటి శ్రీనివాస్, తిప్పారపు సురేష్, కొంపెల్లి సాగర్, సంపత్‌రావు, గుండేటి వాసుదేవ్, సతీష్, మాతంగి శంకర్, పుల్లెల మల్లయ్య, దుర్గాప్రసాద్, గజ్జల శ్రీకాంత్, వినయ్, అభిలాష్, కనకరాజు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ గా సయ్యద్ బారీ

నవతెలంగాణ - భగత్‌నగర్ : కరీంనగర్‌లోని గోదాంగడ్డకు చెందిన సయ్యద్ బారీ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ 13వ డివిజన్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ సిటీ కాంగ్రెస్ మైనార్టీ సెల్ చైర్మన్ సయ్యద్ ఖాజా సైపుద్దీన్ అఖిల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేసారు. ఈ సందర్భంగా సయ్యద్ బారీ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మైనార్టీ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ తాజ్, ఎంఎ నవాజ్, నాయకులు ములుగు ప్రకాష్, రాము, నీహాల్ అహ్మద్ పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటపై అవగాహనా కార్యక్రమం

నవతెలంగాణ - కరీంనగర్ :
కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానంలో అఖిల భారత మొక్కజొన్న పరిశోధన కేంద్రం, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు సంయుక్తంగా జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా యాసంగిలో మొక్కజొన్న పంట మీద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.మంజులత యాసంగిలో మొక్కజొన్న సాగు, ఇతర ఆరుతడి పంటల సాగు చేసే పంటలు, సాగు విధానాన్ని రైతులకు తెలిపారు. అలాగే వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు యాసంగి మొక్కజొన్న, ఇతర ఆరుతడి పంటలలో రకాలు, ఎరువుల యాజమాన్యం, చీడపీడల యాజమాన్యం, వ్యవసాయంలో సమాచార సాంకేతిక సాధనాల వినియోగం మీద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎ.విజయ భాస్కర్, శాస్త్రవేత్తలు డాక్టర్ పి.మధుకర్ రావు, డాక్టర్ డి.శ్రావణి, జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ కె.మదన్ మోహన్ రెడ్డి, శాస్త్రవేత్త డాక్టర్ ఎమ్.రాజేంద్ర ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలో ఆకలికేకలు

- నిర్బంధాలు, ప్రభుత్వాలు కూల్చుడు పనిగానే పాలన
- అటువంటి రాజ్యం తెస్తామంటున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పండి
- కరెంటు మూడు గంటలు కావాలా? 24గంటలు కావాలో ఆలోచన చేయండి
- బీఆర్ఎస్ చూపిన ప్రగతికి పట్టంకట్టండి
- హుజూరాబాద్ మాదిరిగానే మానకొండూర్‌లోనూ దళితబంధు ఇస్తాం
- బీఆర్ఎస్ మానకొండూర్ ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్
- అభివృద్ధిని వివరిస్తూ.. విపక్షాలపై విమర్శనాస్త్రాలు



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / తిమ్మాపూర్

'ఇందిరమ్మ రాజ్యంలో సగం కడుపునకే అన్నంతింటూ ఆకలికేకలు భరించాం. తాగు, సాగు నీరు లేక అల్లాడిపోయాం. నిత్యం నిర్బంధాలు, ప్రశ్నించిన వారిని జైళ్లో వేయడం, ప్రభుత్వాలను కూల్చడమే పనిగా పెట్టుకున్న ఇందిరమ్మ రాజ్యంలో పడ్డ కష్టాలు అందరికీ తెలుసు. ఇప్పుడు ఆ రాజ్యాన్నే తెస్తామంటున్న కాంగ్రెస్ వాళ్లకు ఓటుతో బుద్ధి చెప్పండి. మేము 24గంటల కరెంటు ఇస్తుంటే.. సాగుకు 3గంటలు చాలు అంటున్నారు. ధరణిని తీసి బంగాళఖాతంలో వేస్తామంటున్నారు. రైతుబంధు వేస్ట్ అంటూ మాట్లాడుతున్నారు. కరెంటు,రైతుబంధు కావాలా?వద్దా? అని ఆలోచన చేయండి. గ్రామాల్లో చర్చ పెట్టండి. బీఆర్ఎస్ చూపిన ప్రగతికే పట్టం కట్టండి.' అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మానకొండూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఆశీర్వాద సభను తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఓ ప్రయివేటు కాలేజీ మైదానంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడారు. నేను కరీంనగర్‌కు వచ్చినప్పుడల్లా కొత్త స్కీమును ప్రకటిస్తానని, ఇప్పుడు కూడా ఆటోకార్మికులకు ఏడాదికోసారి భారంపడే ఫిట్‌నెస్‌ఛార్జీలను రద్దు చేస్తానని హామీ ఇచ్చారు. హుజూరాబాద్‌లో పైలట్‌ప్రాజెక్టు కింద చేపట్టిన దళితబంధు స్కీమును మానకొండూర్ నియోజకవర్గంలోని ప్రతి ఎస్సీ కుటుంబానికీ అందిస్తానని చెప్పారు. మెట్టప్రాంతంగా ఉన్న బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాలు చుట్టూ సాగునీటి లభ్యత రావడంతో సస్యశ్యామలంగా మారాయని అన్నారు. అటు మధ్యమానేరుతో ఇల్లంతకుంట, అన్నపూర్ణ ప్రాజెక్టుతో బెజ్జంకి, పరిసర ప్రాంతాల్లో పుష్కలంగా నీరు అందుబాటులోకి వచ్చిందన్నారు. ఎటుచూసినా రోడ్లు, చుట్టూ పచ్చటి పొలాలతో కొత్త రోజులు వచ్చాయన్నారు. 7300 కొనుగోలు కేంద్రాలు పెట్టి ప్రతి సీజన్‌లోనూ ప్రతి గ్రామంలో రైతుల నుంచి వరి ధాన్యాన్ని సేకరిస్తూ ఐదారు రోజుల్లోనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. ఇప్పుడు ఏకంగా 90లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని ఉత్పత్తి చేసి దేశంలోనే పంజాబ్‌ను దాటి నెంబర్‌వన్‌స్థానానికి వచ్చామన్నారు. ఇదంతా సాగునీటి వనరుల పునరుద్ధరణ, పంటపెట్టుబడిసాయంతో సాధ్యమైందన్నారు. ఇప్పుడు పంట పెట్టుబడి కింద ఇచ్చే రైతుబంధు వేస్ట్ అంటూ కాంగ్రెస్ వాళ్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. ధరణి వల్ల ప్రతి రైతు తన భూమిపై సర్వహక్కులు పొంది ఉన్నారని, తన పేరుమీద భూమిని ఎవరికీ మార్చకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామన్నారు. అటువంటి ధరణిని తీసి పాత వీఆర్‌ఓ, పైరవీకారుల రాజ్యాన్ని తెస్తామంటున్న కాంగ్రెస్‌ను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఇక్కడికి వచ్చి తమ రాష్ట్రంలో 5గంటల కరెంటు ఇస్తున్నామని, ఇక్కడా అమలు చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇక్కడ 24గంటల కరెంటు ఇస్తున్న విషయమూ తెలువదా? అంటూ ఎద్దేవా చేశారు. ఇలా తమ ప్రభుత్వ ప్రగతిని వివరిస్తూనే.. విపక్షాలను విమర్శిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగం సాగింది. ఈ సభలో ఎమ్మెల్యే అభ్యర్థి రసమయి బాలకిషన్, మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు, గడ్డం నాగరాజు, దుబ్బ నీరజ, ఎంపీపీ కేతిరెడ్డి వనిత దేవేందర్‌రెడ్డి, జడ్పీటీసీ ఇనుకొండ శైలజజితేందర్‌రెడ్డి సహా నాయకులు, కార్యక్రమాలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

గ్రామాల్లో మద్యం, డబ్బులు దాచిపెట్టారు..

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ - వేములవాడ



'గ్రామాల్లో మద్యం, డబ్బులు దాచిపెట్టారు.. ఏనాడు బహుజన ఇండ్లకు రాని దొరలు ఎన్నికల సమయంలో ఓట్ల అడుక్కోవడం కోసం దొరలు వస్తున్నారు ..బహుజన బిడ్డలందరూ చాలా జాగ్రత్తగా ఉండాలని' బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. వేములవాడ పట్టణంలో గోలి మోహన్ ఏర్పాటు చేసిన బీఎస్పీ ప్రజా ఆశీర్వాద సభలో సిరిసిల్ల బీఎస్పీ అభ్యర్థి పిట్టల భూమేష్ తో కలిసి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ హాజరై మాట్లాడారు. బహుజనులంతా ఐక్యమైతే ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని, బిసి బిడ్డలు నాయకుడు కావాలంటే వంద కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. దొరలు గాలి మోటార్ లో వస్తే ఎక్కడ భూములు, గుట్టలు ఉన్నాయో చూస్తారని, ఎక్కడ కట్టుకోవాలి నీళ్ల ఎట్లా తరలించకపోవాలని ఆలోచిస్తారని తెలిపారు. ఓటును అమ్ముకుంటే మన భవిష్యత్తు పిల్లల భవిష్యత్తుమనమే నాశనం నాశనం చేసుకున్నట్లే అని ప్రజలకు ప్రజలు చాలా జాగ్రత్తగా ఆలోచించి ఓటును వినియోగించుకోవాలని తెలిపారు. బహుజన సమాజ్ పార్టీ అధికారంలోకి వస్తే భూమిలేని పేదలకు ఒక ఎకరం భూమి ఇచ్చి మహిళల పేరిట రిజిస్ట్రేషన్ చేస్తామని హామీ ఇచ్చారు.

గోలి మోహన్ మాట్లాడుతు.. కేటీఆర్ చెలిమెడకు 100 కోట్లకు నాకు రావాల్సిన టికెట్‌ను అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ నియోజకవర్గ ప్రాంత ప్రజలకు సరైన న్యాయం జరగాలంటే బీఎస్పీ పార్టీ గెలిపించుకోవాలని కోరారు.

బీఎస్పీ సభలో అపశృతి చోటుచేసుకుంది. వేములవాడ బిఎస్పి ఎమ్మెల్యే అభ్యర్థి గోలి మోహన్ ప్రసంగిస్తుండగా ఈదురుగాలి ఒక్కసారిగా రావడంతో ఇనుప పైపులతో ఏర్పాటు చేసిన టెంట్లను గాలికి పైకి ఎగరడంతో మొత్తం టెంటు కుప్పకూలిపోయింది. కుర్చీలని చిందర వందర పడిపోయాయి. భయభ్రాంతులకు గురైన మహిళలు పరుగులు తీశారు. ఇనుప పైపులు పైన పడి కొంతమంది మహిళలకు గాయాలు అయ్యాయి. గాయాలు అయిన వారిలో విలేకరుల సైతం ఉన్నారు. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు.

చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌లో సీపీ తనిఖీ



నవతెలంగాణ - తిమ్మాపూర్

చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌ను సోమవారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ లోని పలు రికార్డులను పరిశీలించారు. ఎన్నికల నేరస్థుల, రౌడీ షీటర్ల వివరాలు తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అవసరమైన అన్నీ ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్, రూట్ మార్చ్, వాహన తనిఖీలులు నిర్వహించి ఓటర్ల కు భద్రతా భావాన్ని కలిగించాలని సూచించారు. రానున్న రోజుల్లో ఎన్నికల ప్రచారం ఎక్కువగా జరగనున్నందున రెట్టించిన ఉత్సాహంతో, పటిష్ట ప్రణాళికతో పనిచేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎన్నికల నియమావాళిని రాజకీయ పార్టీలకు, వ్యక్తులకు అతీతంగా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పక్కాగా అమలు పరచాలన్నారు. ఎస్‌హెచ్ఓ, ఎస్ఐ బి.రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సింగాపురం రాజేశ్వరరావు ఆశయ సాధనకు కృషి

కాంగ్రెస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి ఒడితెల ప్రణవ్ బాబు

నవతెలంగాణ-వీణవంక



మాజీ రాజ్యసభ సభ్యుడు సింగాపురం రాజేశ్వరరావు ఆశయ సాధనకు కృషి చేస్తానని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఒడితెల ప్రణవ్ బాబు అన్నారు. మండలంలోని మామిడాలపల్లి, ఇప్పలపల్లి, చల్లూరు, ఎల్బాక, గంగారం, బొంతుపల్లి గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చింతల శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు తుమ్మేటి సమ్మిరెడ్డి, నల్ల కొండాల్‌రెడ్డి, కర్ర భగవాన్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

మండలంలోని దేశాయిపల్లి గ్రామంలో రెడ్డి సంఘం రాష్ట్ర నాయకులు, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ నల్ల కొండాల్ రెడ్డితో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారిలో దేశాయిపల్లి మాజీ ఉపసర్పంచ్‌లు మంద రాజిరెడ్డి, పురంశెట్టి శంకరయ్య, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు జున్నూతుల రాజిరెడ్డి, మండల నాయకులు పత్తి సమ్మిరెడ్డి, బుడిగ జంగం మండల అధ్యక్షులు తూర్పాటి కనకయ్య, కొయ్యడ రాములు, కనకం రామయ్య, గోస్కుల అరవింద్, ఆరేపల్లి సదయ్యతో పాటు సుమారు 150 మందిపైగా కార్యకర్తలు ఉన్నారు.

రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయండి

నవతెలంగాణ- హుజూరాబాద్ : ఈ నెల 23న జమ్మికుంటలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరుకానున్న సభను విజయవంతం చేయాలని పీసీసీ సభ్యుడు పత్తి కృష్ణారెడ్డి కోరారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల అధ్యక్షుడు కొల్లూరి కిరణ్, చెల్లూరి రాహుల్, ఎండి అఫ్సర్, మేకల తిరుపతి, చిట్యాల శంకర్ పాల్గొన్నారు

నూతన నియామకం

నవతెలంగాణ-బోయినిపల్లి : బోయినిపల్లి మండలం మల్లాపూర్ గ్రామంలో అంబేద్కర్ సంఘం ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఇల్లందుల వెంకటేశ్వరబాబు, ఉపాధ్యక్షుడిగా జంగిటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సంజీవ్ కుమార్, క్యాషియర్‌గా కత్తెరపాక స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

నవతెలంగాణ - హుజూరాబాద్ : మండలంలోని సిర్సపల్లి గ్రామంలో సోమవారం బిఆర్ఎస్ పార్టీ నాయకులు పిఎసిఎస్ చైర్మన్ ఎడవెల్లి కొండాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. నాయకులు పి.రామారావు, సిర్సపల్లి ఉపసర్పంచ్ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థి ప్రచారం

నవతెలంగాణ - హుజూరాబాద్ : హుజూరాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని తన సొంత గ్రామం దమ్మక్కపేట్ లో స్వతంత్ర అభ్యర్థి బరిగే గట్టయ్య యాదవ్ సోమవారం పర్యటించారు. గ్రామంలోని ప్రజలను కలుసుకొని తనకు ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. తనను గెలిపిస్తే ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజల పక్షాన ఉంటానని అన్నారు. తన రోడ్డు రోలర్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత

జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి



నవతెలంగాణ-కరీంనగర్ : బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత అని, ఆపద సమయంలో 1098 ఉచిత నెంబర్‌ని వినియోగించుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి అన్నారు. సోమవారం అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచన మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న అన్ని పాఠశాలలో బాలల హక్కుల రక్షణ గురించి ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ కాలనీలో గల బాలసదానంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి పాల్గొని ముఖ్యమైన బాలల హక్కులు జీవించే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, రక్షణ పొందే హక్కు, భాగస్వామ్యపు హక్కు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీసీపీఓ శాంత, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్, బాలసదానం సూపరింటెండెంట్ సంతోషి, బాలల రక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 విభాగం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండారం ప్రభుత్వ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట



ప్రపంచ బాలల దినోత్సవం సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గుండారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయులుగా పసుల సహస్ర వ్యవహరించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గణాధి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటినుండే సెల్ ఫోన్, సోషల్ మీడియాలాంటి వ్యసనాలకు బానిస కాకుండా, జీవితం పట్ల సరైన అవగాహన కలిగి, స్పష్టమైన లక్ష్యంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులుగా పనిచేసిన విద్యార్థుల జీవిత ఆశయాలు, ఆశలు, ఆకాంక్షలు నెరవేరేలా పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ భూక్య శ్రీనివాస్, ఉపాధ్యాయ సిబ్బంది పప్పుల శ్రీనివాస్, ప్రేమ్ సాగర్, కవిత, అంజయ్య, పద్మ పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ - చందుర్తి : ఉరేసుకొని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఎన్‌గల్ గ్రామంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. బంధువులు, పోలీసులు తెలుపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గసికంటి శంకర్, సత్తవ్వ కుమారుడు ప్రమోద్ (22) అనారోగ్యం కారణంగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాడుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్రమంగా మద్యం రవాణాపై కఠిన చర్యలు

ఎక్సైజ్ సీఐ ఎండి అక్బర్ హుస్సేన్

నవతెలంగాణ - జమ్మికుంట



అక్రమంగా మద్యాన్ని అమ్మకం, నిలువ, రవాణా చేసినా వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని జమ్మికుంట ఎక్సైజ్ సీఐ ఎండి అక్బర్ హుస్సేన్ అన్నారు. సోమవారం అక్రమంగా మద్యం బాటిళ్లను రవాణా చేస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జమ్మికుంట పట్టణం నుండి హుజురాబాద్‌కు వెళ్లే దారి వద్ద ఎక్సైజ్ పోలీసులు కాపల నిర్వహించగా, హుజురాబాద్ మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన అంబటి రమేష్ అనే వ్యక్తి వద్దనుండి 6.3 లీటర్ల మద్యం బాటిళను, ద్వి చక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. వీటి విలువ 31,930 రూపాయలు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు రమాదేవి, కబీర్‌దాస్, హెడ్‌కానిస్టేబుల్ ఐలయ్య కానిస్టేబుల్ విశ్వజ్ఞ, రేణుక, మౌనిక పాల్గొన్నారు.

శిక్షణా కేంద్రాలు, పోస్టల్ బ్యాలెట్ ఫెలిసిటేషన్ కేంద్రాల పరిశీలన



శిక్షణ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ కోసం ఉద్దేశించిన కేంద్రాలను సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సోమవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రెండు నియోజకవర్గాలకు సంబంధించి ఫారం-12 ద్వారా పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకునీ ఎన్నికల పోలింగ్ శిక్షణకు వచ్చే సిబ్బందికి అక్కడే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫెలిసిటేషన్ కేంద్రాలలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకోనేలా చేసిన ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ రహస్య ఓటింగ్‌కు భంగం వాటిల్లకుండా పోస్టల్ బ్యాలెట్ ఫెలిసిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. వీరితో పాటు రిటర్నింగ్ అధికారులు ఆనంద్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.గంగయ్య, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి లక్ష్మిరాజం, శిక్షణ కార్యక్రమాల నోడల్ అధికారి పిబి శ్రీనివాస్ చారి, తహశీల్దార్‌లు షరీఫ్, మహేష్, తదితరులు ఉన్నారు.

దుబాయి ఎల్లాల శీనన్న సేవాసమితి సభ్యుల రక్తదానం

నవతెలంగాణ - రామడుగు



యూఏఈ నేషనల్ డే సందర్భంగా దుబాయి ఎల్లాల శీనన్న సేవా సమితి సభ్యులు రక్తదానం చేసినట్లు సేవా సమితి కో ఆర్డినేటర్ చిలుముల రమేష్ సోమవారం తెలిపాడు. ప్రతీ సంవత్సరం యూఏఈ నేషనల్ డే సందర్భంగా ఫ్రెండ్స్ అఫ్ ఇండియా(ఎఫ్వోఐ) నిర్వహించే రక్తదాన శిబిరంలో దుబాయ్ ఎల్లాల శీనన్న సేవాసమితి సభ్యులు రక్తదానం చేస్తామన్నారు. రక్తదానం చేసినవారిలో సేవాసమితి ముఖ్య సలహాదారు అలిగేటి గంగాధర్, రాజ్దీప్, సత్నామ్ ఉన్నట్లు తెలిపారు.

స్వగ్రామానికి గల్ఫ్ కార్మికుని మృతదేహం..

నవతెలంగాణ - చందుర్తి : అనంతపల్లి గ్రామానికి చెందిన బుర్ర గంగాధర్ కువైట్‌లో ఈ నెల 15న గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో అక్కడి కంపనీ వారు సోమవారం స్వగ్రామానికి గంగాధర్ మృతదేహం పంపించారు. స్వగ్రామానికి గంగాధర్ మృతదేహం చేరుకోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాద చాయలు నెలకొన్నాయి. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు మణివర్ధన్, కూతురు మణిదీప్తి ఉన్నారు. పేద కుటుంబానికి గంగాధర్ ఆర్థిక ఇబ్బందుల తో ఉపాధి లేక గల్ఫ్ వెళ్లగా అక్కడ పని చేసుకుంటూ చనిపోయాడు. మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

నవతెలంగాణ
4
జగిత్యాల
మంగళవారం | 21 నవంబర్ 2023 | www.navatelangana.com

ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

- మంత్రి, బీఆర్ఎస్ ధర్మపురి ఎమ్మెల్యే అభ్యర్థి కొప్పుల ఈశ్వర్
- ధర్మపురి మండలంలోని పలు గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర

నవతెలంగాణ - ధర్మపురి /పెగడపల్లి

ప్రజల సంక్షేమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని బీఆర్ఎస్ ధర్మపురి ఎమ్మెల్యే అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సోమవారం ధర్మపురి మండలంలోని గోవిందుపల్లెలో ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కొప్పుల మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో వ్యవసాయానికి కరెంట్, సాగునీరు ఇవ్వలేద న్నారు. నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతు భీమా, వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తున్నా మని చెప్పారు. దళితుల ఆర్థికంగా అభివృద్ధి చెందాలని దళితబంధు పథకాన్ని అమలు చేసిన ఘటన సీఎం కేసీఆర్‌దే అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దాసాండ్ల కాంతయ్య కొప్పుల ఈశ్వర్‌కు ఎన్నికల ప్రచారం కోసం రూ.10వేల విరాళం అందిం చారు. కాంతయ్యను మంత్రి ఆలింగనం చేసుకుని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే కమలా పూర్ గ్రామంలో కూడా ప్రచారం నిర్వహించి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. మరోసారి గెలిపించాలని కోరారు.


మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

గ్రామానికి చెందిన యువకులు కొప్పుల సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు పని చేయాలని సూచించారు.

బీఆర్ఎస్‌లో చేరిన బీఎస్పీ నాయకుడు

పెగడపల్లి :పెగడపల్లి మండల పరిధిలోని ఐత్‌పెల్లి గ్రామానికి చెందిన బహుజన్ సమాజ్ పార్టీ మాజీ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి సీనియర్ నాయకుడు తడగొండ నాగరాజు తన అనుచరులతో పెద్ద ఎత్తున శాఖ మంత్రి, బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో పార్టీలో చేరారు. ధర్మపురి నియోజకవ ర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన కొప్పుల గెలుపు కోసం పని చేస్తానని పేర్కొన్నారు.


కండువా కప్పుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

అభివృద్ధికే పట్టం కట్టండి

కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

నవతెలంగాణ-మెట్‌పల్లి /ఇబ్రహీంపట్నం

కోరుట్ల నియోజవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌కే పట్టం కట్టాలని స్థానిక ఎమ్మెల్యే విద్యాసాగర్‌వు అన్నారు. సోమవారం మెట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. గతంలో రాష్ట్రాన్ని పాలించిన పార్టీల ను చూసి ఓటు వేయాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, మార్గం గంగాధర్, అంబేద్కర్ కాలనీ నాయకులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తనయురాలు సమతారావు ఆధ్వర్య ంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథ కాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమేశ్వరి, సర్పంచ్ నేమూరి లత, నాయకులు జగన్‌రావు, నేమూరి సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యులు చిన్నారెడ్డి, రాజేందర్, నరేష్, జింక శీను తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు


ఇబ్రంపట్నంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


కండువా కప్పుతున్న మంత్రి కేటీఆర్, పాల్గొన్న సంజయ్

బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు

నవతెలంగాణ-మెట్‌పల్లి

మెట్‌పల్లి పట్టణానికి చెందిన బీసీ నాయకుడు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు సాంబారి ప్రభాకర్ సోమవారం కేటీఆర్ సమక్షంలో తన అనుచరులతో కలిసి బిఆర్ఎస్‌లో చేరారు. వారికీ కేటీఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ కోరుట్ల నియోజకవర్గ అభ్యర్థి సంజయ్‌కుమార్ గెలుపు కోసం పని చేయాలని సూచించారు.

మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్

నవతెలంగాణ-జగిత్యాల /జగిత్యాలటౌన్

జగిత్యాలరూరల్ మండలంలోని కల్లెడ, సోమన్‌ఫెల్లి, సంఘంపెల్లి, హబ్సీపూర్, తక్కళ్లపెల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్ కుమార్ కార్నర్ మీటింగ్‌లు సోమవారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయ కులు దామోదర్‌రావు, ఎల్లరెడ్డి, సందీప్‌రావు, దావా సురేష్, బాల ముకుందం, రవీందర్‌రెడ్డి, మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

బిఆర్ఎస్‌లో చేరికలు

జగిత్యాలటౌన్:జగిత్యాలరూరల్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం సభ్యులు లింగన్న, శ్రీనివాస్, తిరుపతి, రాజేశం 20 మంది బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు చేపడుతున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

నవతెలంగాణ-కథలాపూర్

మండలంలోని సిరికొండ, కథలాపూర్, భూషణ్‌రావుపేట్, ఉటుపల్లి, చింతకుంట ప్రభుత్వ పాఠశాలల్లో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు సోమవారం చేపట్టారు. ఈ సంద ర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి భూమేశ్వర్ మాట్లాడుతూ.. టీఎస్ యూటీఎఫ్ ప్రారంభించిన కుటుంబ సంక్షేమ నిధి పథకంలో చేరాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తులసి ఆగమయ్య, మండల అధ్యక్షుడు ఖాలిద్‌పాష, ప్రధాన కార్యదర్శి వుడుగుల వెంకటస్వామి, మల్లేశం పాల్గొన్నారు.

రోడ్డుపై ఉన్న భారీకేడ్లు తొలగింపు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల కొత్త బస్టాండ్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్‌కి వెళ్లే మార్గంలో అగ్నిమాపక శాఖ కార్యాలయం ఎదురుగా తవ్విన గుంతను అధికారులు పూడ్చి వేశారు. సోమవారం నవతెలంగాణలో వచ్చిన 'మరమ్మతులు ఎప్పటికీ పూర్తయ్యేను' కథనానికి అధికారులు స్పందించి మరమ్మతులతోపాటు రోడ్డుకు అడ్డగా ఉన్న భారీ కేడ్లను తొలగించారు.


పూడ్చిన గుంత

జువ్వాడి నర్సింగరావు ప్రచారం


మాట్లాడుతున్న జువ్వాడి నర్సింగరావు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ప్రజలకు సేవ చేయడానికి మీ ముందుకు వచ్చానని ఒక్కసారి ఆశీర్వదించాలని కాంగ్రెస్ కోరుట్ల అభ్యర్థి జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని అమ్మకపేట, డబ్బా, వర్ష కొండ, కోమటి కొండాపూర్, ఎర్దండి, కొజన్ కొత్తూరు, కేశపూర్ గ్రామాల్లో జువ్వాడి నర్సింగరావు ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే ఆరు గ్యారంటీలను వారికి వివరించారు. డబ్బా గ్రామంలో పూదరి నర్సాగౌడ్ ఆధ్వర్యంలో గౌడ కులస్తులు కాంగ్రెస్‌లో చేరారు.ఈ కార్యక్రమంలో కంతి మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్, నషిర్ బాయ్, డబ్బా మాజీ ఉపసర్పంచ్ భూస రాజేశ్వర్, జానశంకర్, కంఠం ప్రభాకర్, దుద్దుల లింగన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

మండలంలోని డబ్బా గ్రామంలో రెండు రోజులు క్రితం పొట్టి మహేష్ ఇంటిలో అగ్నిప్రమాదం జరిగింది. ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఆదేశాలతో డబ్బా ఎంపీటీసీ దేశెట్టి శాంతి జీవన్ బాధితులను పరామర్శించారు. రూ.2వేలు వారికి అందజేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గృహలక్ష్మి పథకం ద్వారా ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నాయకులు గోపి రమేష్, కోటి శ్రీనివాస్, ఎడ్ల రఘు, జరుపుల సలాం, తదితరులు పాల్గొన్నారు.


సాయం అందజేస్తున్న ఎంపీటీసీ

నవతెలంగాణ 5
పెద్దపల్లి
మంగళవారం | నవంబర్ 21, 2023 | www.navatelangana.com

ఆరెంద బ్రిడ్జి..మర్రివాగు ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేస్తా

▸ ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్


మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్

నవతెలంగాణ-మంథని
తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే మండలంలోని ఆరెంద బ్రిడ్జి నిర్మాణానికి,మర్రివాగు ప్రాజెక్టు నిర్మాణానికి తన శాయశక్తుల కృషి చేస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి,పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ హామీ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మంథని మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ఓట్లు వచ్చాయని ఆగమై తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దన్నారు. మనసుండి ఆలోచించే నాయకుడు ఉంటేనే మనం బాగుపడతామని ఆయన అన్నారు. ఒక్కసారి కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి మోసపోయి ఐదేండ్లు అభివృద్ధికి దూరమయ్యారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత తనకు నాలుగేండ్లు ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే ఖాన్సాయిపేట, సూరయ్యపల్లి గ్రామాలకు కల్వర్టులు నిర్మించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశానని అన్నారు. అధికారం కోసం కాంగ్రెస్ నాయకులు ఆరు అబద్దాలతో ముందుకు వస్తున్నారని, మన ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి ఐదేండ్లలో ఏం చేశాడని ఆలోచన చేయాలన్నారు. ఇందిరమ్మ పథకంలో ఇండ్లు మంజూరూ చేసి బిల్లులు మాయం చేశారని, ఇప్పుడు అలాంటి పరిస్థితులు ఉండవని, ప్రభుత్వం అందించే మూడులక్షలతో పాటు సొంతంగా కొంత సాయం చేసి దగ్గరుండి ఇంటి నిర్మాణం చేయించే బాధ్యత తనదేనని ఆయన హామీ ఇచ్చారు. మీ కోసం ఆలోచిస్తూ పనిచేసే బిడ్డగా ఆదరించి ఆశీర్వదించాలని, ఐదేండ్లు సేవకుడిలా పనిచేస్తానని అన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన లింగారెడ్డి


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దాసరి

నవతెలంగాణ -సుల్తానాబాద్ రూరల్
సుల్తానాబాద్ మండలం తొగర్రాయి గ్రామానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాజీ కేడీసీసీబీ డైరెక్టర్ చింతల లింగారెడ్డి పెద్దపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దాసరి మనోహర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు, ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పురం ప్రేమ్ చందర్ రావు, మార్కెట్ చైర్మెన్ బుర్ర మౌనిక-శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు సత్యనారాయణ రావు, పోచమల్లు తదితరులున్నారు.

ప్రజలంతా బీఆర్ఎస్ పార్టీ వెంటే

పెద్దపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దాసరి మమతారెడ్డి

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్
పెద్దపల్లి పట్టణంలోని 22,24 వార్డులో పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతారెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయని, ప్రజలంతా బీఆర్ఎస్ పార్టీ వెంటే ఉన్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో AMC చైర్మన్ జడల సురేందర్,పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు, ఫహీం వార్డు అధ్యక్షుడు నాగుల ఓదెలు, పట్టణ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు వరాల సంపత్, నాయకులు బొంకూరు నరేందర్, బొంకూరి కైలాసం, మధు, శ్యామ్, సాగర్, పద్మలు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న మమతారెడ్డి

ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై ఫిర్యాదు చేయాలి

రామగుండం రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ

నవతెలంగాణ-గోదావరిఖని:
రామగుండం నియోజకవర్గ పరిధిలోని ఎన్నికల పోలింగ్ సమయం దగ్గర పడుతున్న వేళ ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై తమకు ఫిర్యాదు చేయవలసిందిగా టోల్ ఫ్రీ నెంబర్, ఇతర సేవలు ప్రజలకు రామగుండం రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం ప్రచారానికి సంబంధించి ప్రజలను, ఓటర్లను ప్రభావితం చేసే అసాంఘిక కార్యక్రమాలైన మద్యం పంపిణీ, డబ్బు పంపిణీకి సంబంధించిన ఫిర్యాదులు, సందేహాలకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఇట్టి ఫిర్యాదులకు సంప్రదించవలసిన టోల్ ఫ్రీ నెంబర్ 18004256521, టోల్ ఫ్రీ నెంబర్ 1950 సి-విజిల్ యాప్‌వెబ్ పోర్టల్ ఎన్‌జీఆర్ఎస్‌లను ప్రజలకు అందుబాటులో ఉంచామని తెలియజేశారు.


రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ

కాంగ్రెస్‌కు ఓటేస్తే కటిక చీకటే

▸ కరెంట్ కష్టాలను తీర్చింది సీఎం కేసీఆర్ ▸ రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కోరుకంటి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

నవతెలంగాణ-గోదావరిఖని:
కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే కటిక చీకటేనని, ఆ పార్టీ నాయకులను నమ్మితే బతుకులు బుగ్గిపాలేనని... 55 ఏళ్లు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే మన జీవితాలను రోడ్డుపై పడేసీ మనకు కష్టాలు మిగిల్చిందని, రామగుండం ఎమ్మెల్యే, బిఆర్ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం పాలకుర్తి మండలం కొత్తపల్లి, రామరావుపల్లి గ్రామాల్లో ప్రజా అంకిత ఆశీర్వాద యాత్రలో భాగంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్‌తోపాటు నాయకులు కౌశిక హరి, కౌశికలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్ళీ కరెంటు కష్టాలు వస్తాయని... నాడు కరెంటు కోతలతో అల్లడిపోయిన రైతులు నేడు తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పాలనలో హాయిగా బతుకుతున్నారని అన్నారు.ప్రజలు మళ్లీ తమకు మద్దతుగా కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు మల్లెత్తుల శ్రీనివాస్, శేర్ల లక్ష్మిపతి, వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, ఎంపీటీసీ సభ్యులు సంతపురి ప్రియాంకా, గోపు అయిలయ్య యాదవ్, తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై
నాయకుల ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ముత్తారం:
కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్ నాయకులు ముత్తారం మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ తాటిపాముల వకుళారాణి శంకర్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటా తిరుగుతూ ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వివరించారు.కార్యక్రమంలో నాయకులు వెల్మరెడ్డి సంజీవ రెడ్డితోపాటు పలువుర నాయకులున్నారు.

యాదవుల సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యం

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్
యాదవుల సంక్షేమం బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమని ఓదెల దేవస్థానం చైర్మన్ మేకల మల్లేశం యాదవ్ అన్నారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాంసం ఉత్పత్తు లను పెంచాలని యాదవులకు గొర్రెల పంపిణీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిందని అన్నారు. 75 శాతం మంది యాదవులకు గొర్రెల పంపిణీ చేశారన్నారు. సమావేశంలో యాదవ నాయకులు ఆవుల కిషన్ యాదవ్, అర్కటీ రామస్వామి యాదవ్, పాలేటి కొమురయ్య యాదవ్, సలేంద్ర రాములు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

▸ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రూ.2లక్షల రుణమాఫీ ▸ మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు


ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్ బాబు

నవతెలంగాణ-మంథని
కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హాయంలోనే రాష్ట్రం పల్లెలు అభివృద్ధి చెందుతాయని,కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అన్నదాతలకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంథని డివిజన్ పరిధిలోని సోమవారం కమాన్‌పూర్ మండలంలోని రాజాపూర్,గొల్లపల్లి పెరపల్లి, రొంపికుంట గ్రామ పంచాయతీలలో ఎమ్మెల్యే శ్రీధర్ బాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పాలనలో రూ.185లకే అమ్మ హస్తం పేరిట నిత్యావసర సరుకులు అందజేశామన్నారు.రైతులకు మెరుగైన కరెంట్ ఇచ్చిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందని, రైతులకు ఉచితంగా విద్యుత్‌ను కాంగ్రెస్ ప్రభుత్వమే అందించిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

బాలింతలకు పండ్ల పంపిణీ

నవతెలంగాణ - పెద్దపల్లి టౌన్
పెద్దపల్లి జిల్లా మహిళ సాధికారిత కేంద్రం, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం లో యూనివర్సల్ చిల్డ్రన్ డే సందర్భంగా పండ్లు పంపిణీ చేశారు. తల్లులకు ఆడపిల్ల యొక్క ప్రాముఖ్యత, ఆడపిల్లల కు గల ప్రభుత్వ పతకాల గురించి అవగహన కల్పించారు.ఈ కార్యక్రమంలో మహిళా సాధికారిత కేంద్ర కోఆర్డినేటర్ దయా అరుణ, జెండర్ స్పెషలిస్ట్ జె. సుచరిత, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తపాలా శాఖ గోదావరిఖని
సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.శ్రీనాథ్ రెడ్డి

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:
తపాలా శాఖ గోదావరిఖని సబ్‌డివిజన్‌కి నూతనంగా ఇన్స్పెక్టర్‌గా ఎస్.శ్రీనాథ్ రెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఉన్న యం. శ్రీనివాస్ కరీంనగర్‌కి బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న శ్రీనాథ్ రెడ్డిని పోస్ట్‌మాస్టర్ వేణు, మెయిల్ ఓవర్సీర్స్‌సతీష్, పోచయ్య పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.



ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్‌దే విజయం

▸ ప్రచారంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

నవ తెలంగాణ-సుల్తానాబాద్ రూరల్ (ఎలిగేడు)
ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా పెద్దపల్లిలో బీఆర్ఎస్ విజయం ఖాయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్, ఎలిగేడు నారాయణ రావుపల్లి గ్రామలలో ఇంటింటా ప్రచారం నిర్వహించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ గత పాలకులు స్వప్రయోజనం కోసం పనిచేసి అభివృద్ధిని గాలికి వదిలేసారన్నారు. గత తొమ్మిదిన్నర ఏళ్లలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. గులాబీ జెండా నిరుపేదలకు అండగా నిలిచిం దని, కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రపంచంలో ఎక్కడా లేని పథకాలను కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేశారన్నారు. రైతు బంధు, రైతు భీమా, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, దళిత బంధు, బీసీ బంధు, కేసీఆర్ కిట్టు ఇలా ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కేసిఆర్‌కే దక్కిందన్నారు.30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి అసెంబ్లీకి పంపితే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ప్రచారంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎంపీపీ తానిపర్తి స్రవంతి -మోహన్ రావు ,జడ్పీ వైస్ చైర్ పర్సన్ మండిగ రేణుక-రాజనర్సు, మండల పార్టీ అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, పాక్స్ చైర్మెన్ విజయభాస్కర్ రెడ్డి, పాటు బీఆర్ఎస్ ప్రజాప్రతి నిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దాసరి మనోహర్ రెడ్డి

23 లోపు ఓటరు సమాచార స్లిప్పుల
పంపిణీ పూర్తి చేయాలి

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్

నవ తెలంగాణ -పెద్దపల్లి
నవంబర్ 23 లోపు ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం పెద్దపల్లిలోని తిలక్‌నగర్‌లో బూత్ స్థాయి అధికారులు ఓటర్ సమాచార స్లిప్పులు పంపిణీ చేస్తున్న కార్యక్రమాన్ని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ పరిశీలించారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ప్రతి ఒక్క ఓటరుకు తప్పనిసరిగా ఓటర్ సమాచార స్లిప్పులు అందే విధంగా బూత్ స్థాయి అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు.

c m y k

అదనపు బ్యాలెట్ యూనిట్‌ల మొదటి దశ పరిశీలన పూర్తి

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ- పెద్దపల్లి

జిల్లాకు వచ్చిన 624 అదనపు బ్యాలెట్ యూనిట్‌ల మొదటి దశ పరిశీలన పూర్తి చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ అన్నారు. పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఈవీఎం గోదాంలో ఈవీఎం యంత్రాలను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ సోమవారం అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్‌తో కలిసి పరిశీలించారు. జిల్లాలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో వినియోగించే బ్యాలెట్ యూనిట్‌లను కలెక్టర్ పరిశీలించి, అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు.కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో 3అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 2 బ్యాలెట్ యూనిట్లను వినియోగించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్, తహసీల్దార్ రాజ్ కుమార్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రకాష్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, వివిధ రాజకీయ పార్టీలప్రతినిధులు,పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కారం

నవ తెలంగా-మంథని


ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మంథని నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కారం అవుతాయని మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఐయిలి ప్రసాద్ అన్నారు. అయిలి ప్రసాద్ ఆధ్వర్యంలో లక్కేపూర్, తోటగోపయ్యపల్లి, నడింపల్లి గ్రామాలలో సోనియాగాంధీ ప్రవేశ పెట్టిన అభయహస్తం 6 గ్యారంటీ పథకాలను వివరిస్తూ చేతి గుర్తుకు ఓటు వేసి శ్రీధర్ బాబును భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నూకల బానయ్య, మండల ప్రచార కమిటీ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శంకర్, మాజీ ఎంపీటీసీ పార్వతలు, జిల్లా సెక్రటరీ కుడుదుల వెంకన్న,మహిళా కాంగ్రెస్ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్నూరు కాపుల సంక్షేమం పట్టించుకోని పుట్ట మధూకర్

నవతెలంగాణ-మంథని



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మున్నూరు కాపుల సంక్షేమం గురించి పట్టించుకోకుండా ఉన్న బీఆర్ఎస్ పార్టీ అభ్యరి పుట్ట మధూకర్‌కు ఎన్నికలు వస్తేనే మున్నూరు కాపుల గుర్తుకు వస్తారా అని కాంగ్రెస్ నాయకుడు., మాజీ ఎంపీటీసీ కుడుదుల వెంకన్న పేర్కొన్నారు. మంథనిలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంథనిని మున్సిపాలిటీగా చేయడంతో ఉపాధి హామీ పనులు రద్దు కావడంతో మంథనిలో మున్నూరు కాపులకు ఉపాధిలేకుండా పోయిందన్నారు. పుట్టమధూకర్ ఆస్థులు, అంతస్థులు పెరుగుతుంటే మున్నూరు కాపుల ఆస్థులు తగ్గుతున్నాయన్నారు. రూ. 20 లక్షలు ఇస్తామని నన్ను బీఆర్ఎస్‌లోకి రమ్మని ఆఫర్ చేశారని తాను మాత్రం పార్టీ మారలేదన్నారు. బీఆర్ఎస్ రౌడీయిజానికి, హత్యాకాండలకు బయపడేదిలేదన్నారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పర్వతాలు యాదవ్,అయిలి ప్రసాద్, కోటేష్‌లు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ముత్తారం:


పరామర్శిస్తున్న నాయకులు

ముత్తారం మండల కేంద్రంలో పింగిళి రాజిరెడ్డి సుగుణ కుమారుడు పింగిళి రవీందర్ రెడ్డి ఇటీవల మరణించగా ముత్తారం మండల కాంగ్రెస్ నాయకులు సోమవారం పరామర్శించారు. మృతుని చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో ముత్తారం మాజీ జడ్పీటీసీ నాగినేని జగన్మోహన్ రావు, ముత్తారం సర్పంచ్ తూటి రజిత, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బొలినేని బుచ్చం రావు, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గాదం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కి ఓటేస్తే ఉమ్మడి ఆంధ్ర పాలన వస్తుంది

రామగుండం ఎమ్మెల్యే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ:


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

కాంగ్రెస్‌కు ఓటేస్తే ఉమ్మడి ఆంధ్ర పాలన వస్తుందని, 55 ఏళ్లు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే మన జీవితాలను రోడ్డుపై పడేసింది కాంగ్రెస్ పార్టీయేనని బీఆర్ఎస్ రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. సోమావారం 8 కాలనీలో 15,16,17,18,19 డివిజన్‌లో ప్రజా అంకిత ఆశీర్వాద యాత్రలో భాగంగా ఎమ్మెల్యే రోడ్ షో నిర్వహించారు.ఈ రోడ్‌షోలో కోరుకంటి చందర్‌తో పాటు ఎన్నికల ఇంచార్జ్ నారదాసు లక్ష్మన్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలువాలనే మెడికల్ కళాశాల ఏర్పాటు చేయించానన్నారు.రామగుండంలో జరిగిన అభివృద్ధి చూసి ఓర్వలేని కాంగ్రెస్ పార్టీ దుర్మార్గమైన ప్రచారాలు చేస్తుందన్నారు.ప్రజలందరు మళ్లీ తమకు మద్దతుగా నిలిచి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామగుండం నగర మేయర్ డాక్టర్ బంగి అనిల్ కుమార్, కార్పోరేటర్లు తాళ్ల అమృతమ్మ, సాగంటి శంకర్,మందల కిషన్ రెడ్డి, బాదే అంజలి దేవి, బీఆర్ఎస్ నాయకులు అయిలి శ్రీనివాస్, మేడి సదయ్య, గౌస్ పాషా, కొండ్ర స్టాలిన్ గౌడ్, దాసరి శ్రీనివాస్, కుమార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ పోరాట ఫలితంగా సీఎంపీఎఫ్ పాస్‌పుస్తకాల విడుదల

▸ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు

నవతెలంగాణ-గోదావరిఖని:


సీఎంపీఎఫ్ కమీషనర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు (ఫైల్)

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సీఐటీయూ) పోరాట ఫలితంగా భూపాలపల్లి, రామగుండం 1,2,3, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు 2018 నుంచి పెండింగ్ వున్న సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాలను సీఎంపీఎఫ్ రీజనల్ కమీషనం హరిపచౌరి విడుదల చేసినట్లు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు దూలం శ్రీనివాస్, బి.మధులు ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల జీతాల నుంచి కట్ అవుతున్న సీఎంపీఎఫ్ డబ్బులకు సంబంధించి వివరాలతో కూడిన సీఎంపీఎఫ్ పాస్‌పుస్తకాలను అప్లేట్ అయ్యి సీఎంపీఎఫ్ గోదావరిఖని కార్యాలయంలో రెడీగా ఉన్నాయని, వాటిని తీసుకొని వెళ్లి కాంట్రాక్ట్ కార్మికులకు అందించాలని సీఎంపీఎఫ్ కమీషనర్ అన్ని ఏరియాల సింగరేణి అధికారుల ఆదేశించారు. 2018 నుంచి పెండింగ్ వున్న సీఎంపీఎఫ్ పాస్ పుస్తకాల కోసం సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సీఐటీయూ) దశలవారీగా చేసిన పోరాటం ఫలితంగానే పాస్‌పుస్తకాలు విడుదలయ్యాయని, పెండింగ్ పాస్ పుస్తకాలు విడుదల చేయాలని 2022 నుంచి సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం (సీఐటీయూ) నిరంతరంగా పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. సీఎంపీఎఫ్ ట్రస్ట్ మెంబర్‌గా సీఐటీయూ నాయకుడు డిడి రామానందన్ ధన్‌బాద్‌లోని సీఎంపీఎఫ్ కమిషనర్, గోదావరిఖనిలో ఉన్న సీఎంపిఎఫ్ అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు.

మంథని ప్రజలకే మా జీవితాలు అంకితం

నవతెలంగాణ-మంథని


ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ

మంథని నియోజకవర్గ ప్రజలకే మా జీవితాలు అంకితం చేశామని,ఈ మట్టిలో పుట్టిన బిడ్డగా ఈ ప్రాంత ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మంథని మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డు రజక,మంగలివాడ, ఉస్మాన్‌పూర్, విశ్వబ్రాహ్మణవీధి, భగత్‌నగర్‌లలో వార్డు కౌన్సిలర్ గర్రెపల్లి సత్యం ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు.ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ మహిళలకు బొట్టు పెట్టి మంథని ఎమ్మెల్యేగా పుట్ట మధూకర్‌ను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి జరిగిందన్నారు. అంతేకాకుండా అనేక సంక్షేమ పథకాలను ప్రతి గడపకు అందించామని గుర్తు చేశారు.తొమ్మిదేండ్ల కాలంలో తాను సర్పంచ్‌గా,మున్సిపల్ చైర్ పర్సన్‌గా పుట్ట మధూకర్ సహకారంతోనే మంథనికి అభివృద్ధి బాటలు వేశామన్నారు.రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం,సీఎం కేసీఆర్ అధికారంలోకి రాగానే ప్రతి గృహిణికి ఇంటి అవసరాలకు మూడు వేలు,రూ.400లకే గ్యాస్‌సిలిండర్‌తో పాటు కేసీఆర్ భీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు ఆమె వివరించారు. మంథని ఎమ్మెల్యేగా పుట్ట మధూకర్ గెలుపుతోనే మనం బాగుపడుతామని, రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి పుట్ట మధూకర్‌ను ఆదరించి ఆశీర్వదించాలని ఆమె కోరారు.

80 ఏళ్లపై బడిన వారి ఓటింగ్ ప్రక్రియ పూర్తి చేయాలి

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్

నవ తెలంగాణ- పెద్దపల్లి

ఓటు గోప్యత పాటించి 80 ఏళ్లు పై బడిన వారి ఇంటి వద్ద నుంచి ఓటింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఇంటి నుంచి నిర్వహించే పోలింగ్ ప్రక్రియపై సంబంధిత అధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, దివ్యాంగులకు, 80 ఏళ్ళు పైబడిన వృద్దులకు భారత ఎన్నికల కమిషన్ ఇంటి వద్ద నుంచి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించిందని, పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఓటు హక్కు వినియోగించుకునే వారి కోసం ఎన్నికల బృందాలు ఓటర్ల ఇంటికి వెళ్ళి ఓటు హక్కు అందించాల్సి ఉంటుందని అన్నారు. ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో ఓటరు గోప్యత పాటించే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇంటి నుంచి ఓటు స్వీకరించే షెడ్యూల్ వివరాలు పోటీ చేసే అభ్యర్థులకు, తెలియ జేయాలని, వారి ఏజెంట్‌లు సైతం బృందాలతో ఇంటి వద్దకు వెళ్ళవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి సి.హెచ్.మధు మోహన్, తహసీల్దార్ రాజ్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ హఠావో తెలంగాణ బచావో

యాత్రకు సీపీఎం మద్దతు



నిరుద్యోగ చైతన్య యాత్ర బృందాన్ని కలిసిన సీపీఎం పార్టీ నాయకులు

నవతెలంగాణ-మంథని

కేసీఆర్ హఠావో...తెలంగాణ బచావో.. అనే నినాదంతో నిరుద్యోగులు నిరుద్యోగుల చైతన్య యాత్ర మంథనికి వచ్చిన సందర్భంగా యాత్ర బృందానికి సీపీఎం పార్టీ పక్షాన సంపూర్ణ మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దొరల తెలంగాణ మాత్రమే వచ్చిందని సామాజిక తెలంగాణ రాలేదని,నీళ్లు, నిధులు,నియామకాల పేరిట సాగిన తెలంగాణ ఉద్యమం తెలంగాణ వచ్చాక అవినీతిమయమైందని అన్నారు. తెలంగాణలో నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలంటే కేసీఆర్ కుటుంబంలో ఉన్న మూడు ఉద్యోగాలను పీకివేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేష్ నాయకులు ఆర్ల సందీప్ నిరుద్యోగ చైతన్య బస్సు యాత్ర బృందం పాల్గొన్నారు.

బాలికల జూనియర్ కళాశాల పరిశీలన



నవతెలంగాణ-మంథని

మంథనిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్ విద్యాధికారిని కల్పన సోమవారం సందర్శించారు. విద్యార్థుల హాజరు నమోదు, సిలబస్,ఇతర అంశాలపై చర్చించి, రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులు అందరూ కళాశాలకు హాజరు అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లాకు పేరు తీసుకురావాలన్నారు.

గడప గడపకు ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:

రామగుండం కార్పొరేషన్ 48వ డివిజన్‌లో కార్పొరేటర్ పొన్నం విద్య లక్ష్మణ్ గౌడ్ ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ, రామగుండం ఎమ్మెల్యేగా కోరుకంటి చందర్‌ను మరోసారి గెలిపించాలని ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ తానిపర్తి విజయలక్ష్మి గోపాల్ రావు, సమన్వయ కమిటీ మెంబర్ బెందే నాగభూషణం గౌడ్, ప్రతాప్, సతీష్, భాస్కర్, ఓదెలు, చిదురాల అశోక్ తదితరులున్నారు.

మద్యం పట్టివేత



నవతెలంగాణ-మల్లాపూర్

మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.15వేల విలువ గల మద్యాన్ని పట్టుకున్నట్టు ఎస్సై నవీన్ కుమార్ సోమవారం తెలిపారు. ఓబులాపూర్‌లో అక్రమంగా మ్యదం నిల్వ చేసి అమ్మకాలు చేపడుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు వెళ్లి దాడులు చేశామని తెలిపారు. ఆయన వెంట స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ రసీద్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అధికారం ఇస్తే చక్కెర ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తాం

మెట్‌పల్లి విజయసంకల్ప సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

నవతెలంగాణ -మెట్‌పల్లి



మాట్లాడుతున్న అమిత్‌షా

తెలంగాణ బీజేపీ అధికారంలోకి వస్తే చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. సోమవారం మెట్‌పల్లి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన విజయసంకల్ప సభలో పాల్గొని ఆయన మాట్లాడారు. మిషన భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం ప్రాజెక్టుల్లో కేసీఆర్ కుటుంబం అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీకి అధికారం ఇస్తే అవినీతి పరులను జైల్‌కు పంపిస్తామని చెప్పారు. తమ మ్యానిఫెస్టోలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ పాల్గొన్నారు.

ఎఫ్ఆర్ఎస్ హాజరులో సాంకేతిక సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-రాయికల్



ఎఫ్ఆర్ఎస్‌లో హాజరులో సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని డీఈవో డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేల్పుల స్వామియాదవ్ వినతి పత్రం అందజేశారు. రిజిష్టర్ అయిన విద్యార్థుల హాజరు కొన్ని సందర్భాల్లో కొందరివి రావడం లేదని, హాజరు సక్సేస్ ఫుల్ వచ్చిన వారందరివి రిపోర్ట్స్ చూపించడం లేదని, అటెండెన్స్ తీసుకోవడాని చాలా సమయం పడుతుందని, గ్రూఫ్ అటెండెన్స్‌లో సరిగా స్కానింగ్ కావడంలేదని డీఈవోకు వివరించారు.

విద్యార్థినికి సన్మానం

నవతెలంగాణ-రాయికల్



మండలంలోని భూపతి పూర్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బొడ్డుపల్లి రక్షిత ఇటీవల రాష్ట్ర స్థాయి ఉపన్యాస పోటీల్లో మానవ జీవన విధానంలో ప్రకృతి పాత్ర అనే అంశంపై ఉపన్యాసించి మూడో బహుమతి సాధించింది. సోమవారం ఎస్ఎంసి చైర్మన్ జక్కుల ప్రసాద్, ప్రధానోపాధ్యాయురాలు యువి రమణి ఆధ్వర్యంలో రక్షితను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామస్వామి,చిన్నయ్య, నర్సయ్య, గంగాధర్, మహేష్ , గంగారాజం, తిరుమల, శంకరయ్య, కార్తీక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఎస్పీతోనే అభివృద్ధి సాధ్యం

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ-ధర్మపురి



మాట్లాడుతున్న ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్

బీఎస్పీతోనే అభివృద్ధి సాధ్యం అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని పటేల్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆర్ఎస్పీ ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. బహుజన బిడ్డల బతుకులు మారా వాలంటే దొరల పాలన అంతం కావాలన్నారు. దొరలే కాదు బహుజన బిడ్డలు కూడా గాలి మోటర్లలో తిరిగే రోజులు రావాలన్నారు. బీరు, బిర్యానీలకు ఆశపడితే మన బతుకులు మారవన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి నక్క విజయ కుమార్ పాల్గొన్నారు.

ముస్లిం మహిళలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న మహిళా సాధికార బృందం

నవతెలంగాణ-జగిత్యాల

జగిత్యాల పట్టణంలోని ఖిలగడ్డ ప్రాంతంలో జిల్లా మహిళా సాధికారత బృందం ముస్లిం మహిళలకు బేటి బచావో బేటి పడావో పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిస్టిక్ మిషన్ కో ఆర్డినేటర్ మాట్లాడుతూ.. ప్రతి బాలికను చదివించాలని, విద్యతోనే మహిళ సాధికారత సాధ్యమని పేర్కొన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను వారికి వివరించారు. సఖి 181, 1098 చైల్డ్ హెల్ప్ లైన్, తదితర టోల్ ఫ్రీ నెంబర్స్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూపరాణి, రిజ్వానా బేగం, షాహిన్ సుల్తానా, తిరుమల దేవి, అంగన్‌వాడీ టీచర్లు మహిళా సాధికారత కేంద్రం డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ అశ్విని, హేమ శ్రీ, గౌతమి, మైనారిటీ మహిళలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను ఆదరించాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ- కొడిమ్యాల

స్థానికుడైన బీఆర్ఎస్ అభ్యర్థి రవిశంకర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని యువ నాయకుడు నాగ శేఖర్ కోరారు. సోమవారం కొడిమ్యాల మండల కేంద్రంలో విలేకర్లతో నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. 22 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసిన గుర్తింపు దక్కలేదని, నా జీవితమంతా కాంగ్రెస్ పార్టీకి అంకితమైందని తెలిపారు. నిజమైన కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీలో స్థానం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు పులి వెంకటేష్, సర్పంచుల పోరం మండల అధ్యక్షుడు కృష్ణారావు, సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు, నాయకులు లక్ష్మారెడ్డి, నరసింహారెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

నేడు కోరుట్ల గల్ఫ్ గర్జన

నవతెలంగాణ-మల్లాపూర్

నేడు కోరుట్ల పట్టణంలో నిర్వహించే గల్ఫ్ గర్జనకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని గల్ఫ్ కల్చరల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ కుమార్ పిచరా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెట్‌పల్లి పట్టణం నుంచి 11 గంటలకు సైకిల్ ర్యాలీ ద్వారా కోరుట్ల సాయిబాబా గుడి వరకు ఉంటుందని తెలిపారు. అనంతరం జీఎస్ గార్డెన్‌లో గల్ఫ్ గర్జన సభ ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ గల్ఫ్ కార్మికులు, గల్ఫ్ బాధిత కుటుంబాలు తరలిరావాలని కోరారు.



ర్యాలీ తీస్తున్న సిబ్బంది

ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికావొద్దు

నవతెలంగాణ-రాయికల్

పోలింగ్ ముందు ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకూడదని స్వీప్ నోడల్ అధికారి లక్ష్మి నారాయణ అన్నారు. రాయికల్ పట్టణంలో ఓటర్ అవగాహనపై ర్యాలీ, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు అనే వజ్రాయుధాన్ని ఉపయోగించుకొని మంచి నాయకుడిని ఎన్నుకోవాలన్నారు. ప్రజలు ఎన్నికల ఫిర్యాదుల కోసం హెల్ప్ లైన్ 1950కు కాల్ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సహా యకులు సిరిసిల్ల శ్రీనివాస్, కమిషనర్ గంగుల సంతోష్ కుమార్, మేనేజర్ వెంకటేష్, బీఎల్‌ఓలు, ఆర్‌పీలు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సంజయన్న యువసేన సభ్యుల దాతృత్వం

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని ఎర్దండి వడ్డెర కాలనీకి చెందిన బొదాసు పోసాని అనారోగ్యంతో మృతి చెందింది. వృద్ధురాలి ఇద్దరి కొడుకుల్లో ఒక కొడుకు మరణించారు. ఇంకో కొడుకు ప్రమాదవ శాత్తు కాలు విరిగి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. అదె కాలనీకి చెందిన సంజయన్న యువసేన సభ్యులు ముందుకొచ్చి దహనసంస్కారాలు నిర్వహించి వారి కుటుంబానికి సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంజయన్న యువసేన సభ్యులు సురేష్, గంగారెడ్డి, సాయి, అక్షయ్, అశోక్, సంతోష్, రాజు ఉన్నారు.



సరుకులను అందజేస్తున్న సభ్యులు

మున్నూరుకాపు సంఘ నాయకులతో సోమారపు సమావేశం





నవతెలంగాణ-గోదావరిఖని:
గోదావరిఖని గౌతమ్ నగర్‌లో సోమారపు సత్యనారాయణ స్వగృహంలో మున్నూరు కాపు కుల బాంధవుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కాపు కుల సంఘ నాయకులు సోమారపు సత్యనారాయణకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తాను స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్నానని, గతంలో నా హయాంలో జరిగిన అభివృద్ధి చేశానని, మళ్లీ అశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నెల 30 జరిగే ఎన్నికల్లో మున్నూరు కాపు బాంధవులు ఓటు వేసి అత్యధిక మేజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు లైశెట్టి రాజయ్య, సోమారపు అరుణ్, కొండ బానయ్య, ఆరె మధు, సోమారపు రాజేశ్వర్, ఇందూరి సత్యనారాయణలు తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల రక్షణకు కృషి చేయాలి...

జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి స్వర్ణలత

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట



బాలలను రక్షణ వాతావరణంలో పెరిగేలా చూడాలని, జీవించేహక్కు, అభివృద్ధిచెందే హక్కు, రక్షణ పొందేహక్కు, భాగస్వామ్య హక్కులున్నాయని బాలల హక్కుల రక్షణకు అందరు కృషి చేయాలని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి స్వర్ణలత అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ బాలరక్షాభవన్, జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం నిర్వహించారు. బాలల హక్కుల రక్షణకు సంబంధించిన ప్రతిజ్ఞ చేశారు. డిహబ్ దేవిక మాట్లాడారు. రక్షణకు తోడుగా ఉండాలని, సమస్యలు వచ్చినప్పుడు 1098, 112 టోల్ నెంబర్లకు సమాచారం అందించాలన్నారు. ఓఆర్‌డబ్ల్యూ గౌతమి, జాతీయ సేవాపథకం ప్రోగ్రామ్ అధికారి వాసరవేణి పర్శరాములు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ క్యాతం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు పటిష్ట భద్రతా ఏర్పాటు చేయాలి



కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సెంట్రల్ ఎన్నికల అబ్జర్వర్లు , అధికారులు

నవతెలంగాణ - తంగళ్ళపల్లి

అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పూర్తిస్థాయిలో పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేయాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు డాక్టర్ జగదీష్ సొన్‌కర్, వ్యయ పరిశీలకుడు జి.మణిగండసామి అధికారులకు సూచించారు.శాసనసభ ఎన్నికల సందర్భంగా సోమవారం తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి గ్రామంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓట్ల లెక్కింపు కేంద్రం, స్ట్రాంగ్ రూములను ఎన్నికల సాధారణ పరిశీలకుడు డాక్టర్ జగదీష్ సొన్‌కర్, వ్యయ పరిశీలకుడు జి. మణిగండసామి, రిటర్నింగ్ అధికారులు ఆనంద్ కుమార్, మధు సూదన్, డిఎస్పీ ఉదయ్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. డిసెంబర్ 3న నిర్వహించే ఓట్ల లెక్కింపు సందర్భంగా, సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాలలో చేపట్టిన పనుల వివరాలను సాధారణ ఎన్నికల పరిశీలకులకు రిటర్నింగ్ అధికారులు వివరించారు.ఈ ఎన్నికల నేపథ్యంలో ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి వచ్చే ఏజెంట్లకు కానీ, అభ్యర్థులకు కానీ, ఓట్ల లెక్కింపు చేసే అధికారులకు కానీ, ఇక్కడికి వచ్చే ప్రతి ఒక్కరికి పూర్తిస్థాయిలో అన్ని ఏర్పాట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. లే అవుట్ మ్యాప్ ను పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద చేపడుతున్నపనులు,వసతులు, సదుపాయాలను పరిశీలించారు. ఎన్నికల సంఘం నిబంధన మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. పటిష్ట భద్రత చర్యలు చేపట్టాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు పటిష్టంగా ఏర్పాటు చేసి భారీగా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత పార్టీలకు సంబంధించిన కార్యకర్తలు ఎలాంటి అల్లర్లు గొడవలకు పోకుండా పోలీసులు పటిష్టమైన భద్రతను, బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు.

ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉన్నారు

- ఇతర పార్టీల గూండాలు నాపై హత్యాయత్నానికి ప్రయత్నిస్తున్నారు
- బీఆర్ఎస్ కార్యకర్తల వల్ల నేను క్షేమంగా ఉన్న
- చొప్పదండి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సుంకె రవిశంకర్

నవతెలంగాణ - బోయినిపల్లి



ప్రచారంలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

బోయినిపల్లి మండలం నీలోజిపల్లి, కొదురుపాక, వరదవెల్లి, జగ్గారావుపల్లి, రత్నంపేట, దేశాయిపల్లి, రామన్నపేట గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్ సీనియర్ నాయకుడు జోగినిపల్లి రవీందర్‌రావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ ఇంటింటికి బీఆర్ఎస్ పథకాలు వివరిస్తూ ప్రచారంలో దూసుకుపోవడంతో ఇతర పార్టీల నాయకులు ఓర్వలేక, వారి గూండాల చేత తనను నీలోజిపల్లి గ్రామంలో అడ్డుకుని చంపబోయారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు గూండాల బారినుండి కాపాడరని అన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలు తనవెంట ఉన్నారని, నేటి అసెంబ్లీ ఎన్నికల్లో అధిక మెజారిటీతో గెలిపిస్తున్నారని దీమా వ్యక్తం చేశారు. గత ఐదు సంవత్సరాల నుండి నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా పని చేశానని, గతంలో స్థానికేతరులు ఎమ్మెల్యేలుగా గెలిచి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేకపోయారని అన్నారు. ఎన్నికల ముందు వచ్చి తర్వాత వెళ్లిపోయే నాయకులకు ఈ ప్రాంతం మీద మమకారం ఉండదని, తాను ఇక్కడే పుట్టానని అన్నాడు. అందరికీ అందుబాటులో ఉండి.. ఏ ఆపద వచ్చినా అండగా నిలుస్తానని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కె.కొండయ్య, ఎంపీపీ వేణుగోపాల్, మాజీ డీసీయంయస్ చైర్మెన్ ముదుగంటి సురేందర్, సెస్ డైరెక్టర్ సుధాకర్, మార్కెట్ కమిటీ చెర్మెన్ సత్యనారాయణరెడ్డి, నాయకులు అమిత్ కుమార్, కొనుకటి లచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటు ప్రక్రియ పరిశీలన

నవతెలంగాణ - గంగాధర



గంగాధర మండలంలోని ఎన్నికల శిక్షణ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసే ప్రక్రియను కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలించారు. మండల కేంద్రంలో సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటు ప్రక్రియ విధానాన్ని పరిశీలించిన వారు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత పోలింగ్ సిబ్బందిదేనని వివరించారు.

ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలి : సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్

నవతెలంగాణ - గంభీరావుపేట



ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటామని సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగంపేట, ముస్తఫానగర్, గంభీరావుపేట, కొత్తపల్లి గ్రామాల్లో క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి భద్రత చర్యల మీద అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో క్రిటికల్ గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునెల తగిన బందోబస్తు చర్యలను తీసుకునమన్నారు. పోలీస్ సిబ్బంది క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను నిరంతరం సందర్శిస్తూ ఎటువంటి గొడవలు లేకుండా ఎన్నికలను సజావుగా నిర్వహించేలా తోడ్పాటు అందించాలని అవగాహన కల్పించాలన్నారు. క్రిటికల్ ప్రాంతాల్లో వీలైనంత ఎక్కువగా ఫ్లాగ్ మార్చ్, రూట్ మార్చ్, వాహన తనిఖీలులు నిర్వహించి ఓటర్లకు భద్రతా భావాన్ని కలిగించాలని చెప్పారు. ఎన్నికల పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న సందర్భంగా రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలని, విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు.

అనంతరం పెద్దమ్మ చెక్‌పోస్ట్ తనిఖీ చేసి వాహన తనిఖీలు చేసి వాహనాలను నమోదు చేసిన రిజిస్టర్‌ను పరిశీలించడంతో పాటు, ప్రత్యక్షంగా పోలీస్ సిబ్బంది వాహనాలు తనిఖీలు చేస్తున్న తీరును క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. తనిఖీల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించందంతో పాటు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమ నగదు, మద్యం రవాణాను అరికట్టాలని సూచించారు. కార్యక్రమంలో సిఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ మహేష్ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

హుజురాబాద్ రిటర్నింగ్ అధికారి ఎస్ రాజు

నవతెలంగాణ - హుజురాబాద్



పోలింగ్ సమయంలో ప్రతి అధికారి ఎన్నికల సంఘం రూపొందించిన నియమావళిని తప్పనిసరిగా పాటించాలని హుజురాబాద్ రిటర్నింగ్ అధికారి ఎస్.రాజు అన్నారు. సోమవారం హుజూరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికల సిబ్బంది పిఓ, ఏపిఓలకు రెండు రోజుల శిక్షణ శిబిరాన్నిఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోలింగ్ జరిగే సమయంలో ప్రిసైడింగ్ అధికారి, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి ఎన్నికల సంఘం రూపొందించిన నియమాల ప్రకారమే విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి పద్మావతి, మాస్టర్ ట్రేనర్స్ మాధవరావు తదితరులు పాల్గొన్నారు

శిక్షణ శిబిరాన్ని హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల అబ్జర్వర్ ఎంఆర్.రవికుమార్ సందర్శించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఎవరు దానిని అతిక్రమించరాదని అన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మేడిపల్లి సత్యం

నవతెలంగాణ - రామడుగు

మండలంలోని వన్నారం గ్రామంలోని ముదిరాజ్ సంఘం సభ్యులు, రామడుగు మండల ఒగ్గరి సంఘం సభ్యులు 50 మంది కాంగ్రెస్ పార్టీలో సోమవారం చేరారు. ఈ సందర్భంగా గంగాధర మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేడిపల్లి సత్యం వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, దేశరాజుపల్లి సర్పంచు కోల రమేష్, పార్టీ అధ్యక్షుడు బొమ్మరవేణి తిరుపతి, వన్నారం ఎంపీటీసీ జవ్వాజి హరీశ్, నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలిలి

లిక్కర్, నిక్కర్ పార్టీలు ఒక్కటయ్యాయి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

నవతెలంగాణ - వేములవాడ



తెలంగాణ రాష్ట్రంలో అవినీతి అరాచక నియంత కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. సోమవారం వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్స్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆది శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడారు. బీఆరెస్ చేసిన 10 ఏళ్ల విధ్వంసానికి బీజేపీ వెన్నుదన్నుగా ఉందని విమర్శించారు. రాష్ట్రంలో పాలన కొనసాగిస్తున్నది బీఆరెస్ ఒక్కటే కాదని, బీఆరెస్, బీజీపీ కలిసి బీఆర్ఎస్ఎస్‌గా మారి పాలన కొనసాగిస్తున్నదని ఆరోపించారు. రాష్ట్రానికి ఇన్ని సార్లు వచ్చిన మోడీ మేడిగడ్డ పేరు ప్రస్తావించలేదన్నారు. లిక్కర్ స్కామ్ ఏమైందో అందరికి తెలుసు కదా.. లిక్కర్- నిక్కర్ పార్టీలు ఒక్కటయ్యాయన్నారు. మూడవ సారి బీఆరెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రం సర్వనాశనం అవుతుందన్నారు. నాయకులు చంద్రగిరి శ్రీనివాస్‌గౌడ్, సాగరం వెంకటస్వామి, పులి రాంబాబు గౌడ్, ముంజ మునేందర్, పుల్కం రాజు, కనికరపు రాకేష్, కృష్ణప్రసాద్‌గౌడ్, సిపిఐ నాయకుడు కడారి రాములు పాల్గొన్నారు.

సౌత్ జోన్ పోటీలకు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ - కరీంనగర్ రూరల్



కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు పి.అనూష, వి.రమ్య వి.రమ్య, జి.సాయిప్రియ కబడ్డీ ఆట యందు ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. శాతవాహన యూనివర్సిటీ కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారు. ఈ జట్టు ఈ నెల 22వ తేదీ నుండి 26 వ తేదీ వరకు తమిళనాడులోని అలగప్ప యునివర్సిటీ కరైకుడి నిర్వహించే సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయ పోటీలలో పాల్గొంటుంది. ఎంపికైన విద్యార్థునులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ జి.శ్రీధర్‌రావు, డాక్టర్ బి.రజనీదేవి, కె.సతీష్ కుమార్ అభినందించారు.

నవతెలంగాణ 9
పెద్దపల్లి
మంగళవారం | నవంబర్ 21, 2023 | www.navatelangana.com

ప్రజాస్వామ్యంలో అత్యున్నతమైనది ఓటుహక్కే



ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, విద్యార్థులు

నవతెలంగాణ-మంథని:
ప్రజాస్వామ్యంలో అత్యున్నతమైనది ఓటు హక్కు అని జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, మంథని రిటర్నింగ్ అధికారి,ఆర్డీవో హనుమా నాయక్‌లు అన్నారు. సోమవారం జిల్లా ఎన్నికల అధికారి,పాలనాధికారి ముజిమ్మిల్లా ఖాన్ ఆదేశాల మేరకు మంథని పట్టణంలో సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వికలాంగులు, వయోవృద్ధులు,ట్రాన్స్ జెండర్‌లు, అన్ని విభాగాల అధికారులు కలసి ఓటర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, మంథని రిటర్నింగ్ అధికారి హనుమా నాయక్ ఓటు హక్కు గల ప్రాధాన్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సతీష్, మంథని తహసీల్దార్ రాజయ్య,మీడియా సెల్ నోడల్ అధికారి తూము రవీందర్ తదితరులు పాలొన్నారు.

డ్రంకైన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:



రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ టి.ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన డ్రంకైన్ డ్రైవ్‌లో పట్టుబడిన మంజునాథ్‌కు 5 రోజుల జైలు శిక్ష పడింది. ఈ మేరకు ఆయనను సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ దుర్వ వెంకటేష్ ముందు హాజరు పరచగా, ఆయన 5 రోజుల జైలు శిక్ష విధించినట్లు సీఐ తెలిపారు.

ముత్తారం మండల బీఆర్ఎస్ జనరల్ సెక్రెటరీగా రావుల రాజ్‌కుమార్



నియామకపు ఉత్తర్వులు అందజేస్తున్న మండల అధ్యక్షుడు

నవతెలంగాణ-ముత్తారం:
ముత్తారం మండల బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీగా సీతంపేట గ్రామానికి చెందిన రావుల రాజ్ కుమార్‌ను నియమిస్తూ మంథని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాన్ని మండల పార్టీ అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి సోమవారం అందజేశారు. తన నియామకానికి సహకరించిన మండల నాయకులకు రాజ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలి

ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

నవతెలంగాణ-జూలపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాసరి

బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పిలుపునిచ్చారు. జూలపల్లి మండలంలోని బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత పాలకులు సొంత ప్రయోజ నాల కోసం పనిచేశారని, 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి అసెంబ్లీకి పంపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి రాంగోపాల్ రెడ్డి, జడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, గ్రంథాలయ చైర్మన్ రఘువీర్ సింగ్, కంది చొక్కారెడ్డి, నల్ల మనోహర్ రెడ్డి, వైస్ ఎంపీపీ మొగుడం రమేష్ వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో నిరుద్యోగులకు అన్యాయం

నవతెలంగాణ-మంథని
కేసీఆర్ పాలనలో గత పది సంవత్సరాలుగా నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని, 30న జరిగే ఎన్నికల్లో ఓడించాలని నిరుద్యోగ చైతన్య యాత్ర బృందం నాయకుడు శివానంద స్వామి అన్నారు. మంథనిలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు సార్లు అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి కల్పంచక నిరుద్యోగులను రోడ్డు పాలు చేసిందన్నారు. ఉద్యోగాలు ఇస్తామని నోటిఫికేషన్లు జారీ చేసి పలు మార్లు వాయిదాలు వేయడంతో పాటు పేపర్ లీకేజీలతో నిరుద్యోగుల భవిష్యత్తును అందకారంలో నెట్టివేయ బడిందని అవేధన వ్యక్తం చేశారు. లక్షలాది మంది నిరుద్యోగులకు చేసిన మోసాలను ప్రజలకు చెప్పి చైతన్యవంతం చేసేందుకే ఈ యాత్ర చేపట్టామన్నారు. నిరుద్యోగ సంఘం నాయకుడు శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం నీళ్ళు,నిధులు, నియామకాల కోసం నిరుద్యోగ యువత ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడితే బంగారు తెలంగాణ పేరిట అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలమైందన్నారు.గత ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టులు యాభై సంవత్సరాలుగా పటిష్టంగా ఉంటే కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నాలుగు సంవత్సరాలకే దెబ్బ తిని ఉపయోగంలో లేకుండా పోతుందన్నారు. ప్రజలను మోసం చేస్తున్న ఈ ప్రభుత్వానికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. నిరుద్యోగ సంఘం నాయకులు సురేష్, ప్రసాద్,ప్రేంసాగర్,అర్జున్, సందీప్,సాగర్, శివ,బాలకృష్ణలు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

20వ డివిజన్‌లో బీఆర్ఎస్ నేతల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:
మూడవ సారి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను, రెండోసారి ఎమ్మెల్యేగా కోరుకంటి చందర్‌ను గెలిపించాలని కోరుతూ 20వ డివిజన్ రామగుండం రైల్వేస్టేషన్ ఏరియాలో డివిజన్ కార్పొరేటర్ కన్నూరి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తూ, ఎమ్మెల్యే చందర్ సాధించిన మెడికల్ కళాశాల, సబ్ రిజిస్టర్ కార్యాలయాల ఏర్పాటు గురించి ప్రజలకు వివరించారు. ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు షేక్ బాబుమియా, అల్లిగణేష్, ఉప్పరి లక్ష్మన్, ఇంతియాజ్, శేఖర్ నాయక్, చాంద్ పాష, సారయ్య నాయక్, కొమ్మరాజుల శీను, జి.కుమారస్వామి,కె. మల్లేశ్,మల్లేష్, ఖలీల్, మల్లయ్య, మహిళా నాయకురాలు షహేదాభాను, కె.కోమల, వైశాలి, మీనాక్షి, జ్యోతి, సంధ్య, సుజాత, రేణుక తదితరులున్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే
కేసీఆర్‌కు మద్దతుగా నిలవాలి

రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కోరుకంటి చందర్



కార్మికులతో అల్పాహారం చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-గోదావరిఖని:
రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా... రాష్ట్ర ప్రజలు సంక్షేమం ఉండాలన్న కెసిఆర్‌కు, బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలిచి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని రామగుండం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్జీ-1 పరిధిలోని జీడికే-1 సీహెచ్‌పీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 55 ఏళ్ళు పాలించిన కాంగ్రెస్ పార్టీ మాత్రం తెలంగాణ ప్రజలను చీకటిలోకి నెట్టివేసిందని విమర్శించారు. సీఎం కేసీఆర్ కేవలం 10 ఏళ్ల కాలంలోనే రాష్ట్రాన్ని దేశంలోని అగ్రగామిగా చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కేవలం మూడు గంటలు వ్యవసాయానికి సరఫరా చేస్తామని చెప్పకనే చెబుతూ వారి మోసపూరిత కుట్రలను రైతులు గమనించాలని పిలుపునిచ్చారు. కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ 24 గంటల పాటు నాణ్యమైన కరెంటు సరఫరా చేస్తూ రైతుల జీవితాల్లో సంతోష్ వెలుగులో నింపుతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏనాడు కూడా ప్రజల సంక్షేమం కోసం, అదేవిధంగా సింగరేణిలో మహిళా కార్మికుల కోసం ఆలోచన చేయలేదని చందర్ ఆరోపించారు. టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కవిత సహకారంతో సింగరేణి సంస్థల మహిళలకు పనిచేసే అవకాశం దక్కిందని ఆయన అన్నారు. బీఆర్ఎస్ విడుదల చేసిన మ్యానిఫెస్టో కార్మికులకు వివరిస్తూ.. ఓట్లను అభ్యర్థించారు. కార్మిక సంక్షేమం కోసం ఎల్లవేళలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించి.. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు కెంగర్ల మల్లయ్య, గండ్ర దామోదర్ రావు, జావిద్ పాషా, దాసరి శ్రీనివాస్, మధుగిరి మల్లేష్, శంకర్, మండ రమేష్ గౌడ్, మల్లారెడ్డి, పుట్ట రమేష్, సాధన కుమార్, సుభాష్, సదానందం, నరసయ్య, తిరుపతి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కారు అద్దాలు పగలగొట్టడం
పిరికిపందల చర్య

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్ రెడ్డి



మాట్లాడుతున్న పోతుపెద్ది కిషన్ రెడ్డి

నవతెలంగాణ-ముత్తారం:
మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కారు అద్దాలు పగలగొట్టడం పిరికిపందల చర్యని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అడవీ శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బర్ల చంద్రమౌళి సంబంధించిన కారు అద్దాలను పగ కొట్టడం హేయమైందని, గ్రామంలో పుట్ట మధుకు వస్తున్న ఆదరణను ఓర్వలేక కాంగ్రెస్ నాయకులు ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తుంగాని సమ్మయ్య, ఉప సర్పంచ్ మద్దెల దివాకర్, గ్రామ శాఖ అధ్యక్షుడు నిమ్మతి రమేష్, అలువోజు రవీందర్, కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పప్పు చంద్రమౌళి, రైతుబంధు గ్రామ శాఖ అధ్యక్షుడు సల్ల సమ్మయ్యలు ఉన్నారు.

ఎంపీటీసీ ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-ముత్తారం:



శాసన సభ ఎన్నికల్లో మంథని కాంగ్రెస్ అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధిక మెజార్టీతో గెలుపొందాలని ముత్తారం మండలం అడవీ శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, గ్రామ ఎంపీటీసీ దొడ్డ గీతారాణి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

నవతెలంగాణ-మంథని:
మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా జరిగాయి. వారోత్సవాలకు కళాశాల ప్రిన్సిపల్ సి.హెచ్. పరిశయ్య అధ్యక్షత వహించి ప్రసంగిస్తూ విద్యార్థులు నిత్య జీవితంలో పుస్తక పఠనం అనేది ఒక అలవాటుగా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు డాక్టర్ భారత్, ఐక్యూఏసీకో-ఆర్డినేటర్ కృష్ణ,ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్. లక్ష్మీనారాయణ, అధ్యాపకులు సతీష్, అమర్నాథ్, ముకుందము, మానస, రజిత పాల్గొన్నారు.

పట్టణంలో బీఎస్పీ ప్రచారం

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్
పెద్దపల్లి పట్టణం 8వ వార్డ్ లో బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష గడప గడపకు ప్రచారం నిర్వహించి ఇంటింటా బీఎస్పీ మ్యానిఫెస్టో లోని సంక్షేమ పథకాలను వివరిస్తూ మ్యానిఫెస్టో కరపత్రాలు అందజేశారు.పెద్దపల్లి కౌన్సిలర్ రాజం మహంతా కృష్ణ, గంగుల సతీష్‌ల ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర హిందూ పరిషత్ జిల్లా జనరల్ సెక్రెటరీ లింగంపల్లి కరుణాకర్ (అడ్వకేట్) బీఎస్పీలో చేరగా బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి హనుమయ్య పార్టీలోకి ఆహ్వానించారు.

c m y k